ప్రజాశక్తి

బుధవారం 5 జులై 2023 | 5 | విజయనగరం



28 మందికి గ్రేడ్-2 హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలోని 28 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు గ్రేడ్ 2 హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి లభించింది. మంగళవారం విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కౌన్సిలింగ్‌లో మొత్తం 28 గ్రేడ్2 హెచ్ఎం పోస్టులకు ఉద్యోగన్నతి కల్పించాల్సి ఉండగా సీనియారిటీ జాబితా ఆధారంగా 34 మంది స్కూలు అసిస్టెంట్లు హాజరయ్యారు. వారిలో ఆరుగురు అన్ విల్లింగ్ తెల్పడంతో మిగిలిన 28 మందికి వారు కోరుకున్న ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు.

యువతకు మార్గదర్శి అల్లూరి

సీతారామరాజు జయంతి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు





అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, కలెక్టర్ నాగలక్ష్మి; కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం

భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నేటి యువతకు మార్గదర్శి అని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. అల్లూరి 126వ జయంతిని మంగళవారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. దాసన్నపేట రింగు రోడ్డులోని అల్లూరి కూడలి వద్ద డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి, మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, డిఆర్ఒ ఎం.గణపతిరావు తదితరులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు, వారి జీవిత చరిత్రలను నేటి తరం వారు తెలుసుకొని స్ఫూర్తి పొందడానికే వారి విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం గాంధీ, ఆజాద్, సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో సమరయోధులు వేర్వేరు పద్ధతుల్లో పోరాటాలు చేశారని, అల్లూరి సాయుధ పద్ధతుల్లో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి సవాల్‌గా నిలిచారని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో ఎందరో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా అల్లూరి సేవాసమితి ద్వారా ఎస్.కోట, అనంతగిరి, రామభద్రపురం మండలాలకు చెందిన నలుగురు గిరిజన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున నగదు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వీరుల చరిత్ర భావితరాలకు బోధించాలి

అల్లూరి లాంటి వీరుల చరిత్రను భావితరాలకు బోధించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి జెసి, డిఆర్ఒ అధికారులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభ లో జె.సి మాట్లాడుతూ అల్లూరి లోని నాయకత్వ లక్షణాలను, వారి త్యాగ స్ఫూర్తిని ,దేశ భక్తిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

పోలీసుశాఖ ఆధ్వర్యాన....

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి ఎం.దీపిక అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్యంలో బ్రిటీషు వారి దోపిడీని ఎదుర్కొని, గిరిజనులకు అండగా నిలిచి, వారిని ఎంతగానో చైతన్యపర్చారన్నారు. అల్లూరి సీతారామ రాజు నేడు భౌతికంగా మన మధ్య లేనప్పటికీ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చూపిన తెగువ, పట్టుదల మనందరికి ఆదర్శనీయమని అన్నారు. ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, డిపిఒ ఎఒ వెంకటరమణ, లీగల్ అడ్వయిజర్ వై. పరశు రాం, సిఐలు జె.మురళి తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి అల్లూరి

జిల్లా పరిషత్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి జెడ్‌పి చైర్మన్ ఎం.శ్రీనివాసరావు పూలమాల వేసే ఘన నివాళు లర్పించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అని కొనియాడారు తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుని చరిత్ర రాబోయే తరం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్, ఇతర అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయంలో

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో అల్లూరి చిత్రపటానికి విసి కట్టమణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర యునివర్సిటీ ఆంత్రోపాలజీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ పి.డి.యెస్. పాల్ కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం అల్లూరి జయంతి సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యాన...

గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి ఎస్ఇ బి.ఉమాశంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ పాలకులను ఎదురించి గిరిజనుల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించిన ఉద్యమ కెరటం అల్లూరి అన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణప్రభాత్, ఇఇ ఎవిఎస్ రాజన్, వేదాంత ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు ఎస్‌వి సత్యనారాయణ, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టండి

నాడు-నేడు పనులు నెలాఖరుకు పూర్తి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పాఠశాలల్లో నాడు నేడు పనులు జరుగుతున్న కారణంగా, విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టి, ప్రమాదాల నివారణకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని పాఠశాలల్లో సెప్టిక్ ట్యాంకు, సంప్ ట్యాంకు, పునాదులు కోసం తవ్విన గోతులు, ఐరన్ రాడ్లు తదితర నిర్మాణ సామగ్రి, మేడ మెట్లు, పై అంతస్తు నిర్మాణం తదితర చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి చోట రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. తరగతి గదుల మరమ్మతులు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు వేగంగా జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులకు కొరత లేదని, జిల్లాలో పాఠశాలల వద్ద ఇప్పటికే సుమారు రూ.10కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నాయని, వాటిని త్వరగా ఖర్చుచేసి, పనులు పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులను ఈ నెలాఖరుకి పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలను రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి, అవసరమైన పనులకు ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పంపించాలని సూచించారు. సమావేశంలో డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి, డివిఇఒ ఆర్.సురేష్ కుమార్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, ఎంఇఒలు, మండల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఇవిఎం గోదాముల వద్ద పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు పాటించాలని, చిన్న పొరపాటు కూడా జరగడానికి వీలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలను తగినన్ని అమర్చాలని, మూడు నెలల కాలపరిమితికి సంబంధించిన స్టోరేజీని భద్రపరచాలని చెప్పారు. జెసి మయూర్ అశోక్‌తో కలిసి నెల్లిమర్లలోని ఇవిఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ క్రమంలో సీల్ ఓపెన్ చేసి గోదాములను తెరిచారు. ఇవిఎంలు, బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని గోదాములు నిర్మించిన తీరుపై ఈ సందర్భంగా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కింది భాగంలో గచ్చులు ఎత్తుపల్లాలు ఉండటాన్ని గమనించిన కలెక్టర్ త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కొన్ని చోట్ల లైట్లు వెలగకపోగా వాటి స్థానంలో కొత్తవాటిని వేయాలని సూచించారు. లోపలా.. బయట పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. పర్యటనలో భాగంగా ఆ ప్రాంగణంలో ఉన్న పాత, కొత్త గోదాముల్లో కలియ తిరిగారు. ఈ క్రమంలో అక్కడ పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. సరిపడా సిబ్బంది ఉన్నారా లేరా అని ఆరా తీశారు. అదనపు సెక్యూరిటీ సిబ్బంది అవసరమనుకుంటే తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. పై అంతస్తుకు వెళ్లే చోట ఇనుప రాడ్లు ఇబ్బందిగా ఉండటాన్ని గమనించిన ఆమె వాటిని తొలగించాలని అక్కడ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దేవ్ ప్రసాద్, తహశీల్దార్ రమణమూర్తి రాజు తదితరులు ఉన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం




సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక మెసానిక్ టెంపుల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పద్మలీల, రోటరీ క్లబ్ సెక్రటరీ రవి మండ మాట్లాడారు. బ్రిటిష్ వారి ఆధిపత్యం నుండి భారత దేశ ప్రజలకు విముక్తి కలిగించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని నేటి విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. నేటి ప్రభుత్వం చేసే విద్యా వ్యతిరేక విధానాలపైన అల్లూరి స్ఫూర్తితో విద్యార్థులు పోరాటం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ అంటే విద్యార్థుల సమస్యలపై ఆందోళనలు పోరాటాలే కాకుండా విద్యార్థులకు అవసరమైన రక్తాన్ని సేకరించడానికి ప్రతి ఏటా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినంద నీయమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పూడి రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను తీసుకువస్తూ విద్యార్థులను నడిరోడ్డుపై నిలబెడుతోందని, దీనికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో విద్యార్థులు పోరాటంలో ముందుకు రావాలని అన్నారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అఖిలభారత కమిటీ సభ్యులు సిహెచ్ పావని, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జె. రవి కుమార్ , ఎం. సౌమ్య, మెసానిక్ టెంపుల్ ప్రెసిడెంట్ గాదె ప్రభాకర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.రమేష్,రాజు , వెంకటరమణ , లావణ్య , కళ్యాణి , సంధ్య , రఘు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజల ముంగిటకే సేవలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవినీతి, లంచగొండితనం లేకుండా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రభుత్వపరంగా ఏ సేవలకూ ఒక్క రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన అవసరం రాలేదని, మున్ముందు కూడా రాదని స్పష్టం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 4, 6 డివిజన్లతోపాటు.. మండలంలోని కొండకరకాం సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమాల్లో ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి రహితంగా ఇంటి ముంగిటకే సేవలు అందుతున్నాయని వివరించారు. అర్హత ఉన్న వారు ఏ కారణంతోనైనా పథకాలకు దూరం కాకూడదన్న సదుద్దేశంతో జగనన్న సురక్ష ద్వారా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని, టోకెన్లు ఇస్తున్నారని తెలిపారు. ఇంకా ఎవరైనా పథకాల లబ్ధికి దూరమైతే వెంటనే సంబంధిత ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమాల్లో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌ఛార్జిలు ఎస్.బంగారునాయుడు, ముచ్చు శ్రీను యాదవ్, బోడసింగి ఈశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, ఎంపిపి మామిడి అప్పల నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు జమ్ము శ్రీను, పిఎసిఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, ఎంపిటిసి సభ్యులు ప్రత్యేకాధికారి అరుణకుమారి, వ్యవసాయా ధికారి మోపాడ ఉమామహేశ్వరనాయుడు పాల్గొన్నారు.

వికలాంగులకు కృత్రిమ అయవాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తిరుమల హాస్పిటల్ ఎమ్‌డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, డాక్టర్ కృష్ణ శాంతి, సూపరింటెండెంట్ ఆఫ్ జైలర్ సెంట్రల్ ప్రిజన్ ఎస్. కిషోర్ కుమార్ హాజరయ్యారు. ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం 50 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, చెవిటి మిషన్స్, బ్లైండ్ స్టిక్స్, చంక కర్రలు, వాకర్స్, వీల్ చైర్స్ అందజేశారు. వందమంది వృద్ధులకు రేషన్ పంపిణీ, వంద మంది అంధులకు పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, శ్రీగురుదేవ హాస్పిటల్ ఛైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, ట్రస్ట్, హాస్పిటల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఫణింద్ర తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి వర్ధంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాపుల ముద్దుబిడ్డ వంగవీటి మోహనరంగా ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తామని జిల్లా తెలగ కుల యువజన సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా నగరంలో తెలగ యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా విజయనగరం కోట జంక్షన్ వద్ద ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో వంగవీటి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోట కూడలి వద్ద తెలగ యువత ఆధ్వర్యంలో భారీగా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పిడుగు సతీష్, పుంద్రోతు రవీంద్రకుమార్, యార్లగుల చక్రవర్తి, మొదిలి శ్రీనివాస్, కుందేటి రామకష్ణ, ఎం.గాయత్రి, వై.మాధవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

- భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య యాత్రలో టిడిపి నాయకులు
- నాలుగేళ్లయినా ఇవ్వని టిడ్కో ఇళ్లు
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు



బిసి హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న బుద్దావెంకన్న, అశోక్ తదితరులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో వైసిపి హయాంలో రాక్షస పాలన సాగుతోందని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి ఏమీ లేదని, పైగా టిడిపి హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నాశనం చేశారని దుయ్యబట్టారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట చేపట్టిన బస్సుయాత్రను మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర సోనియానగర్, విజయనగరం మీదుగా రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో సాగింది. తొలుత కలెక్టరేట్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి అశోక్‌గజపతిరాజుతో పాటు పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త బుద్దా వెంకన్న, మాజీమంత్రులు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్టీవో కార్యాలయం, గుడి వద్ద ప్రభుత్వ మద్యం దుకాణాన్ని పెట్టడాన్ని నిరసిస్తూ మద్యం దుకాణం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధ వెంకన్న మాట్లాడుతూ ఈ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కళ్ళు చెవులు లేకుండా పనిచేస్తుందని అన్నారు. వెంటనే ఇక్కడ మద్యం దుకాణాను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సోనియా నగర్‌లో టిడ్కో ఇళ్లను సందర్శించారు. లబ్దిదారులతో నాయకులు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్ధ వెంకన్న మాట్లాడుతూ టిక్కో ఇళ్లను చంద్రబాబు నాయుడు హయంలోనే 80శాతం పూర్తి చేసినా ఈ నాలుగేళ్లలో ఉన్న పనిని పూర్తి చేసి లబ్ధిదారులకు వైసిపి ప్రభుత్వం అప్పగించలేకపోయిందని ఎద్దేవా చేశారు. మొదట ప్రాధాన్యత లబ్ధిదారులు ఎవరైతే ఉన్నారో వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ స్పీకర్ కులాలు, మతాలు, డబ్బులు చూసి ఇళ్లు ఇవ్వడం దారుణమన్నారు. అనంతరం అంబటి సత్రం జంక్షన్ వద్ద మైనార్టీ నాయకులు పలు సమస్యలపై వినతులు ఇచ్చారు. అనంతరం గురజాడ అప్పారావు స్వగృహాన్ని సందర్శించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ వారసులైన ప్రసాద్ , సంధ్య టిడిపి నాయకులకు కన్యాశుల్కం పుస్తకాన్ని అందజేశారు. అనంతరం పెద్ద చెరువు వద్ద మురుగు నీటి శుద్ధి కర్మాగారాన్ని పరిశీలించారు. ద్వారపూడి కొండపై టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. వైసిపి ప్రభుత్వం ఈ ప్లాంట్‌ను నాశనం చేసిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో బైక్ ర్యాలీతో యువత స్వాగతం పలికారు. చెల్లూరు-గొట్లాం రింగ్‌రోడ్డుపై నాయకులంతా సెల్ఫీలు దిగారు. రాకోడులో ఏర్పాటుచేసిన డ్రిప్ ఇరిగేషన్‌ను వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని అన్నారు. దుప్పాడలో బిసి హాస్టల్‌ను పరిశీలించిన నాయకులు అక్కడ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కెఎ నాయుడు, ఆర్‌పి భంజ్‌దేవ్, మాజీ ఎమ్మెల్సీలు సంధ్యారాణి, ద్వారపురెడ్డి జగదీష్, జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు, నాయకులు కందిచంద్రశేఖర్, బొద్దల నర్సింగరావు, ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పదవులకే వన్నె తెచ్చిన రోశయ్య : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్యవైశ్యుల ముద్దుబిడ్డ, మేధావి కొణిజేటి రోశయ్య అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలను జిల్లా, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోలగట్ల.. తొలుత రోశయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కోసి పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు వంటివారి తర్వాత ఆర్యవైశ్యుల్లో ఆణిముత్యం రోశయ్యని అన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎక్కడా ఒక మచ్చ అయినా లేకుండా ఉండటం గొప్ప విషయమన్నారు. నిస్వార్థ రాజకీయ నేతకు నిలువెత్తు నిదర్శమని కొనియాడారు. ఆర్యవైశ్యులు సంఘ సేవకులు, సేవాతత్పురులుగా పేరుందని, దానిని నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి, కార్యదర్శి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, తవ్వా మోహనరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, అమరజీవి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ పాల్గొన్నారు.

మానుకొండ స్ఫూర్తితో పోరాటాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, గజపతినగరం

స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, ఐద్వా అఖిలభారత నేత, మానుకొండ సూర్యా వతి స్ఫూర్తితో మహిళలు సమస్యలపై పోరాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. సూర్యావతి వర్ధంతి సందర్భంగా మంగళవారం ముచ్చెరువుగట్టుపై కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి రమణమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సూర్యావతి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని, 1942 లో ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభకు అధ్యక్షులుగా ఎన్నికయ్యారని తెలిపారు. మహిళలకు ఆస్తిహక్కు కావాలని అనేక ఉద్యమాలు నడిపారని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన..

సూర్యావతి చిత్రపటానికి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సూర్యావతి స్ఫూర్తితో మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ పట్టన నాయకులు మహాలక్ష్మి, పద్మ, అప్పయమ్మ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

గజపతినగరం సూర్యావతి స్ఫూర్తిగా ఉద్యమాలు చేస్తామని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి అన్నారు. బంగారమ్మ పేట గ్రామంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యావతి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. లక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మహిళలను చైతన్య పరిచి స్త్రీలకు సమాన హక్కులు కావాలని, బాల్య వివాహాలు, బాల వితంతువులు, ప్రతి 10 గ్రామాలకు ఒక ఆసుపత్రి కట్టించాలని, స్త్రీలకు విద్య నేర్పించాలని, తీర్మానాలు చేసి బ్రిటిష్ ప్రభుత్వానికి పంపించారన్నారు. కమ్యూనిస్టు నేతగా, శాసన సభ్యులుగా పనిచేశారన్నారు ఐద్వా నాయకులు టి.అచ్చియమ్మ, రాములమ్మ, అప్పయ్యమ్మ, శారద పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-గజపతినగరం

తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కమిటీ సెక్రటరీ రెడ్డి శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్, మెజిస్ట్రేట్ ఆ ఫస్ట్ క్లాస్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు ప్లకార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం జాతీయస్థాయిలో వెంటనే అమలు చేయాలన్నారు. డెత్ వెల్ ఫర్ ఫండ్‌ను రూ. పది లక్షలకు పెంచాలని, యువ న్యాయవాదులకు లా నేస్తం సొమ్మును ప్రతినెలా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.30 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యు.రమేష్, టి.దేవుడు, జి.విద్యాసాగర్, టి.దేవుడుబాబు, ఆర్.శివ హరినాధరావు, సిహెచ్. తిరుపతిరావు, పి.ఆదినారాయణ, రాంబాబు, పి.శ్రీను, ఎస్.రామ వాసుదేవరాయ్, ఆర్.సాయిసురేష్, కె. సాయిశేఖర్ పాల్గొన్నారు.



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి- వంగర

ఆశా వర్కర్లకు పని ఒత్తిడిని తగ్గించి, కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక పిహెచ్సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ఆశా వర్కర్లు ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారిధిగా పనిచేస్తూ వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వీళ్ళపై అధికారులు తీవ్రమైన పని భారాన్ని ఒత్తిడిని పెంచి మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనివల్ల ఆశా కార్యకర్తలు అనారోగ్య పాలై ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆశా వర్కర్లకు గౌరవ వేతనం రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సంఘీభావంగా నిలుస్తూ తమ వంతు సహాయంగా ఆశా కార్యకర్తలు విరాళాన్ని సిఐటియు నాయకులు రామ్మూర్తినాయుడుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటలక్ష్మి, రూపావతి, తులసి, కుమారి, జయమ్మ పాల్గొన్నారు.

జగనన్న అమ్మఒడి విద్యార్థులకు వరం

రామభద్రపురం: అమ్మఒడి విద్యార్థుల భవితకు ఒక వరం వంటిదని ఎమ్మెల్యే ఎస్. చిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండలానికి విడుదలైన అమ్మఒడి నిధులు రూ.6.99కోట్లు నమూనా చెక్కును విద్యార్థులు తల్లులకు అందజేశారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు రాగి జావ పంపిణీ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాగిజావ నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని మెను ప్రకారం అందజేయడం లేదని రుచి, శుచి లేకపోవడంతో తమ పిల్లలు తాగేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే 9వ తరగతి విద్యార్థిని పీడీ అకారణంగా చితక బాదిన వైనంపై ఆ విద్యార్థి పేరెంట్స్ సభా ముఖంగా ఆ ఉపాధ్యాయిని పై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్కూల్ హెచ్ఎం కామేశ్వరరావుతో మాట్లాడి రాగిజావ పంపిణీ నాణ్యత ఉండాలన్నారు. అనంతరం దుప్పలపూడిలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, ఎంఇఒ తిరుమల ప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, హెచ్ఎం కామేశ్వర రావు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే

వేపాడ: వైసిపి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సింగరాయ గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని, రూ. 21లక్షలతో నిర్మించిన ఆర్బికె కేంద్రాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సచివాలయాలను నిర్మించి ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసే విధంగా పనిచేస్తోందన్నారు. అనంతరం సచివాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, డిసిసిబి చైర్మన్ వివి. చిన్న రామునాయుడు, జెడ్పిటిసి అప్పలనాయుడు, ఎఎంసి చైర్మన్ కస్తూరి, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు ఎం జగన్నాథం, హ్యూమన్ రైట్ కమిటీ మెంబర్ సిహెచ్ పద్మావతి, జిల్లా బిసి సంఘం అధ్యక్షుడు ఎం సత్యనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, సింగరాయ సర్పంచ్ ఎన్ వెంకట్రావు, ఎంపిటిసి ఆర్ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ

గజపతినగరం : స్థానిక ఎరువుల దుకాణాలను మంగళవారం ఎడిఎ ఎం.శ్యాంసుందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీస్, మన గ్రోమోర్ సెంటర్, సాయి శ్రీనివాస ఆగ్రో ఏజెన్సీస్, శ్రీ సత్య సాయి ట్రేడర్స్ దుకాణాలలో విత్తనాల డీలర్స్ లైసెన్స్, సోర్స్ సర్టిఫికెట్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. శ్రీదేవి ఆగ్రో కెమికల్స్, సాయి శ్రీనివాస ఆగ్రో ఏజెన్సీస్‌లో సోర్స్ సర్టిఫికెట్ లేకోవడంతో వంగ, మొక్కజొన్న విత్తనాల విక్రయాలు నిలుపుదల చేశారు. రైతులకు విత్తనాలు ఇచ్చే ముందు మొలకశాతం కట్టాలని సూచించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఖాళీలు భర్తీ



మాట్లాడుతున్న సమన్వయకర్త పద్మజ

నెల్లిమర్ల : జిల్లాలోని అంబేద్కర్ గురుకుల కళాశాలల్లో పారదర్శకంగా ఖాళీలు భర్తీ చేస్తున్నామని సాంఘిక సంక్షేమ జిల్లా సమన్వయ కర్త తోట పద్మజ తెలిపారు. మంగళ వారం స్థానిక వేణుగోపాలపురం అంబేద్కర్ గురుకుల కళాశాలలో జిల్లా లోని అంబేద్కర్ గురుకుల కళాశాల మిగులు సీట్ల ఖాళీల భర్తీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఖాళీల భర్తీ ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 230 ఖాళీలుండగా వాటిలో 117 ఎంపిసి, బైపిసి సీట్లు భర్తీ జరిగిందని భామిని, వియ్యంపేట, నెల్లిమర్ల అంబేద్కర్ గురుకుల కళాశాలకు చెందిన 119 ఆర్ట్స్ గ్రూప్‌నకు సంబంధించిన సీట్లు భర్తీ కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమా దేవి పాల్గొన్నారు..

శత శాతం వ్యాధి నిరోధక టీకాలకు కృషి

జామి: క్షేత్రస్థాయిలో అర్హులైన గర్భిణులు, చిన్నారులకు శాతశాతం వ్యాధి నిరోధక టీకాలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ రెడ్డి అచ్యుత కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం ఆశా డే సందర్భంగా జామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి వ్యాధి నిరోధక టీకాలు అందించడంతో పాటు వాటిని వెబ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. టీకా కార్యక్రమంలో ఆశాలు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. ఆశాలు మొబైల్ ఫోన్ల సమస్యల్ని తొలగించుకునే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ వనజ, సామ్రాజ్య లక్ష్మి, డాక్టర్ ఎన్. శృతి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.అనిల్ ప్రేమ్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్ విద్యార్థులకు బహుమతులు

డెంకాడ: విజయనగరం నెహ్రూ యువ కేంద్రంలో యువ ఉత్సవ్ 2023ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి అర్హత నిమిత్తం డిక్లమేషన్, యంగ్ ఆర్టిస్ట్, యంగ్ రైటర్, ఫోటోగ్రఫీ, కల్చరల్ విభాగాలలో జిల్లా స్థాయి పోటీలను మంగళవారం నిర్వహించారు. యంగ్ రైటర్ విభాగంలో ఎంవిజిఆర్ కళాశాల విద్యార్థులు ఎల్లపు కావ్య, ఫోటోగ్రఫీ విభాగంలో బి. శివ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎంవిజిఆర్ కళాశాల డైరెక్టర్ పి. సీతారామరాజు ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్, డీన్ అఫ్ స్టూడెంట్స్ ఎస్ మోహన్ కుమార్, ఐక్యూ ఏసి కన్వీనర్ వి. నగేష్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్. షణ్ముఖ రావు, సిబ్బంది విజేతలను అభినందించారు.

సిసి డ్రైయిన్ల నిర్మాణ పనులు పరిశీలన

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో 10వ వార్డు గొల్లపల్లి గ్రామంలోని సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, మహేష్, హరి కుమార్, 10వ వార్డ్ వైసిపి ఇంఛార్జి తుట్ట తిరుపతి, మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరమణ, పాల్గొన్నారు.

బుక్ కీపర్లకు శిక్షణ

లక్కవరపుకోట : మండల వైకెపి కార్యాలయంలో బుక్ కీపర్లకు (విఒఎ) వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎన్ ఆదయ్య మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన లోక్ ఒఎస్ యాప్‌లో డ్వాక్రా మహిళా సంఘాల పేర్లుతో పాటు సభ్యుల పేర్లు, వారి ఆధార్, ఫోన్ నెంబర్లు వంటి వివరాలను విధిగా నమోదు చేయాలని సూచించారు. సంబంధిత వివరాలను ఏ విధంగా అప్లోడ్ చెయ్యాలనే విషయంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం స్త్రీ నిధి మేనేజర్ కె రమణ స్త్రీ నిధి నుండి మంజూరైన నగదును సక్రమంగా లబ్ధిదారులకు చేరడమే కాకుండా వారి నుండి వసువులైన రికవరి నగదును సకాలంలో బ్యాంకులకు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకెపి ఎపిఎం టి అప్పలనాయుడు, డి సూర్యనారాయణ, విఒఎలు పాల్గొన్నారు.

రంగాకు నివాళి

బొబ్బిలి: కాపునేత వంగవీటి మోహన్ రంగాకు తెలగ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్ ప్రసాదరావు మంగళవారం నివాళి అర్పించారు. మోహన రంగ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

గంట్యాడ: మండలంలోని కొఠారిబిల్లి జంక్షన్ దగ్గరలో అక్రమంగా తరలిస్తున్న పది మద్యం సీసాలను మంగళవారం ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు పట్టుకున్నారు. లక్కిడాం గ్రామానికి చెందిన బోధింకి కనక సత్యం 10 మద్యం సీసాలను లక్కిడాం గ్రామానికి తరలిస్తున్న సమయంలో అతన్ని పట్టుకొని అదుపులోనికి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న సురక్షతో ప్రజల వద్దకే సేవలు

ప్రజాశక్తి - గుర్ల


జనగనన్న సురక్షతో మరోసారి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎస్ఎస్ఆర్ పేట, గూడెం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజకవర్గ వైసిపి పరిశీలకులు కెవి సూర్యనారాయణ రాజు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, వైసిపి నాయకులు సన్యాసినాయుడు, జెడ్పిటిసి శీర అప్పలనాయుడు, జిల్లా పశు సంవర్ధక చైర్మన్ బెలాన బంగారునాయుడు, వైస్ ఎంపిపి తిరపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని మున్సిపల్ చైర్మన్ సావు మురళీ కృష్ణారావు అన్నారు. మంగళవారం పాత బొబ్బిలి, రావువారి వీధి సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, డిటి సాయికృష్ణ, కౌన్సిలర్స్ రమేష్ నాయుడు, రామకృష్ణ బాబు, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాల్‌రావు, బుడా ఛైర్మెన్ ఇంటి పార్వతి, కోఆప్షన్ సభ్యులు తెర్లి సత్యారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమములో ఎంపిపి పీరుబండి హైమావతి పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతులను ఆదుకోవడం కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నరసింహమూర్తి, ఎంపిడిఒ బానోజీరావు, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, విద్యుత్ శాఖ ఎఇ ప్రశాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేయటానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టామని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం మోపాడ గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పిటిసి బడ్డుకొండ లక్ష్మీ, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కనక సింహాచలం, నాయకులు రమేష్, వైస్ ప్రెసిడెంట్ చిన్ని, రాష్ట్ర డైరెక్టర్లు, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రజలకిచ్చిన హామీలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం జరిగిందని జెడ్పిటిసి గదల సన్యాసి నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ అన్నారు. మంగళ వారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కొండవెలగాడ, బొప్పడాం గ్రామాల్లో ధవ పత్రాలను పంపిణీ చేశారు. ఈ



గుర్ల: ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, బొప్పడాం సర్పంచ్ అంబల్ల కిరణ్, తుమ్మలపేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, చంద్రం పేట మాజీ సర్పంచ్ కర్రోతు వెంకట రమణ, నాయకులు వాల్లె అప్పలనాయుడు ఎంపిడిఒ జి.గిరిబాల, ఇఒపిఆర్డి హెచ్. భానోజీ రావు తదితరులు పాల్గొన్నారు.

నగరపంచాయతీలో జెసి ధృవపత్రాల పంపిణీ

నగర పంచాయతి పరిధిలోని జరజాపుపేట-1 సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 సేవలు ఉచితంగా అందుతున్నాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, నాయకులు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జామి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులై మిగిలున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని వెన్నె గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 102 కుల ధవ పత్రాలు, 3 సిసి ఆర్సి కార్డులు, 12 ఆధార్ అనుసంధానం ధవ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ సిహెచ్ సత్యారావు, ఎంపిపి అరుణ, జెడ్పిటిసి గొర్లె సరయు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల వైసిపి కన్వీనర్ గొర్లె రవి కుమార్, వెన్నె సర్పంచ్ జయలక్ష్మి, జన్నివలస సర్పంచ్ అండ్ మండల జేసీఎస్ కన్వీనర్ చంద్రు నాయుడు, ఎంపిటిసి రాయివరపు సత్యం, తహసీల్దార్ హేమంత్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలో జాకేరు, సింగరాయ గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిపిని సిబ్బంది సాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు బి చిన్నమ్మలు, ఎన్ వెంకటరావు, ఎంపిటిసిలు టీవీ రమణ, ఏ సత్యనారాయణ, రాజేష్, వైస్ ఎంపిపిలు ఈశ్వర రావు, ముత్యాలమ్మ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బొండపల్లి: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలు అందించడమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం నెలివాడ గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ తాళ్ళపూడి కీర్తి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ముద్దూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ మునకాల పైడినాయుడు అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్పిటిసి రాపాక సూర్యప్రకాష రావు, ఎఎంసి. చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, తహశీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపిడిఒ వైబి.రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: జగనన్న సురక్షతో ప్రజలు లబ్ధి పొందాలని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. మంగళవారం మండలంలో దేశపాత్రునిపాలెంలో ఎంపిడిఒ వై. పద్మజ ఆధ్వర్యంలో, చింతలపాలెం పంచాయతీలో తహశీల్దార్ శ్రీనివాసుమిశ్రా ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మూకల కస్తూరి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, పిఎసిఎస్ అధ్యక్షులు గోరపల్లి శివ, మండల వైసిపి అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, దేశపాత్రునిపాలెం సర్పంచ్ దళాయి లక్ష్మి, పిఎస్ఎన్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరం అన్నారు. మంగళ వారం చెల్లాపురం, చిన బంటుపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష, అమ్మఒడి, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. చిన బంటుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వైసిపి ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్ వి రమణ రాజు, కోట్ల వెంకటరావు, గ్రామ సర్పంచ్ కోట్ల ఆరుణ కుమారి, ఎంపిటిసి పల్లి క్రిష్ణ మూర్తి నాయుడు, పప్పల క్రిష్ణ మూర్తి, బూర్లె నరేష్ కుమార్, ఎస్వి కృష్ణమూర్తి రాజు, సింగారపు రామకృష్ణ, కర్రోతు నాగేశ్వరావు, తహశీల్ధార్ విజయ భాస్కర్, ఎంపిడిఒ ఎం. రత్నం, ఎంఇఒ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి 'అల్లూరి'

ప్రజాశక్తి - కొత్తవలస

స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసిన విప్లవ జ్యోతి, సాయుధ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని, అల్లూరి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కొత్తవలస క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ లెక్కల నాయుడు బాబు, డిసిసిబి చైర్మన్ వేచలపు రామనాయుడులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా అల్లూరి విగ్రహానికి ముఖ్య అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ బాల సూర్యారావు, మండల క్షత్రియ సేవా సమితి పెద్దలు, ఎంపిపి ఎన్ గోపమ్మ, కొత్తవలస సర్పంచ్ మచ్చ రామస్వామి, పిఎసిఎస్ అధ్యక్షుడు గోరపల్లి శివ, ఉపాధ్యక్షుడు బొంతల వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

గజపతినగరం: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ముందుగా ఆ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అల్లూరి చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం 11 మంది రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మండల రాము మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు సాయి, కూర్మారావు, మండల కమిటీ సభ్యులు లోకేష్, వినయ్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం పంచాయతి సమీపంలో ఉన్న మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో అల్లూరి సీతారామరాజు 125వ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ పాత్రో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళలర్పించారు. 9వ తరగతి విద్యార్థి పి. లీలా చైతన్య వేసిన అల్లూరి వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఎంపిడిఒ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం భాగ్యలక్ష్మి, టైపిస్ట్ వినయ్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మన్యం వీరుడు సీతారామరాజు పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమాలు చేయాలని వామ పక్ష నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెడ్పి బాలికోన్నత పాఠశాలలో సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వామ పక్ష నేతలు కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్ని బాబు, మొయిద పాపా రావు, కాళ్ళ అప్పల సూరి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

బొబ్బిలి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం లోకబందు రెసిడెన్సీలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తదాన శిబిరాన్ని ఎస్ఐబి సిఐ ఆర్.జైభీమ్ ప్రారంభించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మండల అధ్యక్ష కార్యదర్శులు కె.మణి కుమార్, ఎస్.శివ, గర్ల్స్ కన్వీనర్ ఆర్.శ్రావణీ, గాయత్రి, పావని, శృతి, మండల నాయకులు వాసు, దేవిడ్, తేజ, కృష్ణ, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన నివాళి

జనసేన కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, కాపునేత వంగవీటి మోహన్ రంగ జయంతి వేడుకలు నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి, వంగవీటి సేవలను జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కొనియాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గంగాధర్, లంక రమేష్, నాగు, తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలోని అన్ని పాఠశాలల్లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. మండలంలోని గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు పాఠశాల ఆవరణలో ఉన్న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రామభద్రపురం: భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో ఒక మహోజ్వాల శక్తి అల్లూరి సీతారామరాజని ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్రోద్యమంలో ఒక ప్రత్యేక చిరస్మరణీయ అధ్యాయమని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. మంగళవారం నాయుడువలస పాఠశాలలో అల్లూరి సీతారామరాజు 125 వ జయంతి ముగింపు వేడుకను విద్యార్థులుతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, కృష్ణ మోహన్, శివున్నాయుడు, రవికుమార్, కృష్ణం నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమ నిర్మాత 'గంటి'

బొబ్బిలి: ఉత్తరాంధ్ర కార్మిక ఉద్యమ నేత గంటి ప్రసాదం అని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, విరసం రాష్ట్ర నాయకులు పాణి, అమరుల బంధు మిత్రుల సంఘం నాయకులు పద్మకుమారి అన్నారు. గంటి ప్రసాదం భవనంలో మంగళవారం గంటి ప్రసాదం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ గంటి ప్రసాదం బొబ్బిలి, సాలూరు ప్రాంతాల్లో కాకుండా, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో కార్మిక ఉద్యమాన్ని నిర్మించారని కొనియాడారు. బొబ్బిలిలో అధిక వేతనాలు సాధనలో గంటి ప్రసాదం పాత్ర కీలకమన్నారు. ప్రజల జీవన పరిస్థితి మెరుగు కోసం ఆర్థిక పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం పని చేసిననాడే గంటి ప్రసాదంకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అమోఘం

కొత్తవలస: మారుమూల గ్రామంలో దివ్యాంగులకు చేస్తున్న సేవలు అమోఘమని విజయనగరం తిరుమల హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ కృష్ణ శాంతి అన్నారు. మంగళవారం ట్రస్టును ఆమెతో పాటు, విశాఖ సూపరెండెంట్ అఫ్ జైలర్ సెంట్రల్ ప్రిజన్ ఎస్. కిషోర్ కుమార్ సందర్శించారు. ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం 50 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్ళు, చేతులు, చెవిటి మిషన్స్, బ్లైండ్ స్టిక్స్, చంక కర్రలు, వాకర్స్, వీల్ చైర్స్ పంపిణీ చేశారు. 100 మంది వృద్ధులకి రేషన్ , మరో 100 మంది అంధులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, ట్రస్ట్, హాస్పిటల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఫణింద్ర, సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ఘన సత్కారం

వేపాడ : వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసి బదిలీ అయిన ముగ్గురును ఎస్ కోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రి నాయుడు, ఎస్ఐ రాజేష్ మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ప్రాంతంలో కూడా మంచి పేరు తెచ్చుకుని అంకితభావంతో పనిచేయాలన్నారు.

ఒంపల్లి ఎంపిటిసి సభ్యులు మృతి

ప్రజాశక్తి- బొండపల్లి




సత్యనారాయణ

మండలంలోని ఒంపల్లి ఎంపిటిసి లండ సత్యనారాయణ (44) మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సత్యనారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. సత్యనారాయణకు భార్య, కుమార్తె ఉన్నారు. చిన్న వయసులో సత్యనారాయణ మృతి చెందడంతో ఒంపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా ఆయన మృత దేహం వద్ద టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివ రామకృష్ణ, ఒంపల్లి మాజీ సర్పంచ్ ఇల్లాపు కృష్ణ, గరుడబిల్లి మాజీ సర్పంచ్ తాడ్డి అప్పలనాయుడు, బొండపల్లి మండల పార్టీ అధ్యక్షులు పైల శ్రీనువాసరావు పలు టిడిపి నాయకులు కార్యకర్తలు నివాళలు అర్పించారు. ఒంపల్లి, వేంద్రాం సర్పంచ్‌లు లండ నారాయణమ్మ, కర్రోతు శ్రీనువాసరావు, వైసిపి నాయకులు బొద్దల చిన్నం నాయుడు, లెంక రమణ, ఆల్తి గౌరినాయుడు తదితరులు నివాళలు అర్పించారు. ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్పిటిసి రాపాక సూర్యప్రకాష్‌లతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి- రామభద్రపురం



ఘటనా స్థలంలో మృతి చెందిన పైడిరాజు

విద్యుత్తు షాక్‌తో ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన పైడిరాజు(45) ఘటనా స్థలంలోనే మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు. పొలంలో ఆవులకు గడ్డి కోసి తెచ్చేందుకు ఉదయం వెళ్లిన పైడిరాజు మధ్యాహ్నం భోజన సమయానికి కూడా ఇంటికి రాక పోవడంతో బార్య పోలమ్మ, బంధువులు పొలాల్లో వెతకడంతో జొన్న సేను గట్టు దగ్గర విగతజీవిగా పడి ఉన్న పైడిరాజును గుర్తించారు. పక్కనే విద్యుత్ పోల్ నుంచి తెగి పడిన వైరు పైడిరాజు కాలికి చుట్టు కొని ఉంధి నడిచి వెళుతున్న పైడిరాజు కాలికి తెగి పడిన విద్యుత్ వైరు తగలడంతో షాక్ తగిలి మృతి చెందారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్యుత్ శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాడంగి సిహెచ్‌సికి తరలించారు.